

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల

గడువు మూడు నెలల పొడిగింపు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలలు పాటు మార్చి 1 నుండి మే 31 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాలశాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా గురువారం ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ప్రస్తుతం ఫిబ్రవరి 28 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే మార్చి 1 నుండి మే31 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్, ఎంఏసి చైర్మన్ సుమిత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

స్మార్ట్ మీటర్లపై

ఏపిఈఆర్‌సి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాష్ట్ర ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నా, పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమైనా లెక్కచేయకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డిస్కాంలు ప్రతిపాదించిన విధంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ ఏపిఈఆర్‌సి ఇచ్చిన తీర్పును సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ తీర్పును తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. క్వాజీ జ్యుడీషియల్ అథారిటీగా ఉంటూ వినియోగదారుల హక్కులను పరిరక్షించాల్సిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాంగంగా మారిపోయిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని, బిగింపులను ఎక్కడకక్కడ తిరస్కరించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇది నూటికి నూరు పాళ్ళు కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఉద్దేశించిందని, వినియోగదారులపై అదనపు భారం అవుతుందని అన్నారు. ఈ విధంగా బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించే



హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి గాని ఏపిఈఆర్‌సికి గాని లేదని అన్నారు. ఒక వైపు ఛార్జీలు పెంచడం లేదంటూనే మరొకవైపు చార్జీల పెంపుదలకు మూలంగా ఉండే స్మార్ట్ మీటర్లు బిగించడం దొడ్డి దారిన చార్జీల భారాన్ని పెంచటమే అన్నారు. దీనికి ముందు సెకి ద్వారా అదానితో జరిగిన విద్యుత్ ఒప్పందాలను ఏపిఈఆర్‌సి ఖరారు చేసిందని, ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా అదానీ అవినీతి బట్టబయలుకు ఆ ఒప్పందాలను పలు రాష్ట్రాలు, దేశాలు తిరస్కరించి వెనక్కు పంపిస్తున్న నేపథ్యంలో మన రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి దానికి ఆమోదముద్ర వేయడం అవినీతికి ఆమోదం తెలపటమే అని అన్నారు. లక్ష ఇరవై వేల కోట్ల అదనపు భారాన్ని వినియోగదారులపై హక్కు ఏపిఈఆర్‌సికి లేదన్నారు. సెకితో జరిగిన ఒప్పందాల వల్ల వినియోగదారులపై అదనభారం పడుతుందని విద్యుత్ శ్వేతపత్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో పేర్కొన్నదని అయినా ఏపిఈఆర్‌సి దీనికి ఆమోదం తెలపడం గర్హనీయమన్నారు. వెంటనే సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల తీర్పును ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. దీనివల్ల అదనపు ఖర్చు తప్ప రాష్ట్రానికి ఒరుగుతున్నదేమీ లేదని, ఈ తతంగం మొత్తం రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు విధానాలకు ఒక చట్టబద్ధమైన ఆమోదముద్ర వేసుకోవటానికే అని స్పష్టమవుతున్నదన్నారు. ఏపిఈఆర్‌సి ప్రపంచ బ్యాంకు ఒప్పందంలో భాగంగా ఏర్పాటు చేసిందని 20 ఏళ్ల క్రితం సిపిఎం దీన్ని వ్యతిరేకించిందని, సిపిఎం చేసిన డిమాండ్ సరైనదేనని ఆచరణలో రుజువైందని ఇప్పటికైనా ఏపిఈఆర్‌సి తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు.

సిఎం పర్యటనకు ఏఎస్ఎల్

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు: కలెక్టర్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్చి 1న గంగాధర నెల్లూరు మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో మార్చి 1న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేపట్టనున్న సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పి.వెంకటేష్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి మణికంఠ చందోలుతో కలసి



భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



పింఛను లబ్ధిదారుల ఇళ్ల వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గంగాధర నెల్లూరు హరిజనవాడలో సభా వేదిక, రామానాయుడుపల్లిలో హెలిప్యాడ్, తదితర ప్రాంతాలో ఏఎస్ఎల్ (అడ్వాన్సుడ్ సెక్యూరిటీ లైయిజన్) నిర్వహించి అధికారులు చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు. హెలిప్యాడ్ వద్ద, కాన్వాయ్, ప్రజావేదిక, ఫోటో ఎగ్జిబిషన్, స్టాల్స్‌లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, కార్యక్రమ నిర్వహణలో లోటుపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ చేసే లబ్ధిదారులతో మాట్లాడి కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, అడిషనల్ ఎస్పి శివానంద కిషోర్, సీఎం సెక్యూరిటీ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్, డీఎస్పీ సాయినాథ్, సిఎం సెక్యూరిటీ డిఎస్పి రాజ్ కుమార్, సీఐ శ్రీనివాసంతి ఉన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలోని 5వ వార్డు సచివాలయాన్ని కమిషనర్ పి.నరసింహప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. వార్డు సచివాలయంలో కార్యదర్శుల హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. సమయపాలన పాటించాలని, పన్నుల వసూళ్లలో ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. వివిధ పనులపై వార్డు సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం కమిషనర్ కొంగారెడ్డిపల్లి, పుత్తూరు రోడ్డులో పారిశుధ్య నిర్వహణ, ఇంజనీరింగ్ పనులను పరిశీలించారు. పుత్తూరు రోడ్డులో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అంచనాలు రూపొందించి సమర్పించాలని ఏఈని ఆదేశించారు. నగరం మొత్తంలో లైటింగ్ వ్యవస్థ ఆటోమెటిక్ సెన్సార్ విధానంలో పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పారిశుధ్య నిర్వహణ, రోడ్ల శుభ్రత పనులను తనిఖీ చేశారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు ఉన్నారు.



వార్డు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న నగర కమిషనర్

నిరుద్యోగులకు సువర్ణ అవకాశం

ప్రజాశక్తి- కుప్పంటౌన్

కుప్పం నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని కడా పీడి వికాస్ మర్మత్ గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో పదవ తరగతి ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో 1ఎం 1బి గ్రీన్ స్కిల్స్ రెడీనెస్ సెంటర్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వివిధ నగరాలలోని ప్రముఖ సంస్థల్లో అనేక రకాల ఉద్యోగ అవకాశాలకు నిరుద్యోగులను సన్నద్ధం చేసి, ఉద్యోగాలు ఇప్పించడానికి 1ఎం 1బి గ్రీన్ స్కిల్స్ రెడీనెస్ సెంటర్ ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఈనెల 28వ తేదీ ప్రిప్లేస్మెంట్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పొందిన వారికి మార్చి 11వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న శిక్షణ కార్యక్రమంలో ఇంటర్వ్యూకి ఎలా ప్రిపేర్ అవ్వాలి, ఇంటర్వ్యూను ఏ విధంగా ఎదుర్కోవాలి, ఉద్యోగం సాధించడానికి అవసరమైన శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు

నేడు ఇంటర్వ్యూలు: కమిషనర్

ప్రజాశక్తి- కుప్పం టౌన్

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కుప్పం పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కుప్పం పట్టణ పరిధిలో రాయితీ రుణాలకు లబ్ధిదారుల ఎంపికలో భాగంగా 28వ తేదీ శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో అర్జీదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు పురపాలక సంఘం కమిషనర్, బ్యాంకు అధికారులు సంయుక్తంగా నిర్వహించనున్నారని, కావున అర్జీదారులు ప్రతిఒక్కరూ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇంటర్వ్యూలకు వచ్చేవారు వారి వెంట ఆన్లైన్ అప్లికేషన్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రం, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు మూడు సెట్లు తీసుకురావాలని సూచించారు. ఆన్లైన్ అప్లికేషన్ ఇదివరకే పురపాలక సంఘం కార్యాలయంలో సమర్పించిన వారు మినహా మిగిలిన వారు తప్పకుండా వారి పై తెలిపి ఉన్న వాటిని తీసుకురావాలన్నారు.


ఉపాధి కూలీలకు పని దినాలు పెంపు

ఏపీవో దినకర్ బాబు

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం కరువు మండలంగా ఇదివరకే ప్రకటించడంతో ఉపాధి హామీ పథకంలో ఉపాధి వేతన దారుల 100 రోజుల పని దినాలను 50 రోజులకు పెంచి 150 రోజులుగా ప్రకటించారని ఈ అవకాశాన్ని ఉపాధి వేతనదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ దినకర్ బాబు కోరారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ శ్రమశక్తి సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకుని మేట్ వ్యవస్థను కూడా పునరుద్ధరించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని అన్ని పంచాయతీల పరిధిలో శ్రమశక్తి సంఘాలు మేట్ వ్యవస్థను తీసుకువచ్చేందుకు ఉపాధి వేతన దారులకు అవగాహన కల్పించి ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తామని తెలిపారు.

ఉద్యోగోన్నతులపై డీఈవోకు ఎస్‌టియు వినతి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌టియు నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పదోన్నతుల కోసం, టీచర్ల సీనియారిటీ జాబితాలు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో స్పెషల్ ఎడ్యుకేషన్, ప్రత్యేక ప్రతిభావంతుల జాబితాను కూడా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) చిత్తూరు జిల్లా శాఖ, డీఈవోకు విజ్ఞప్తి చేసింది. గురువారం చిత్తూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎస్‌టియు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్మోహన్ రెడ్డి, బి.మోహన్ వినతిపత్రాన్ని డీఈవోకి సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టుకు అర్హత గల సెకండరీ గ్రేడ్ టీచర్లు జిల్లాలో ఉన్నారని, వారికి సంబంధించిన సీనియారిటీ జాబితాను కూడా విడుదల చేయాలని కోరారు. వివిధ సబ్జెక్టులలో ప్రత్యేక ప్రతిభావంతులకు పదోన్నతుల కోసం కేటాయించిన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈవో వరలక్ష్మి స్పందిస్తూ అన్ని క్యాడర్ల సీనియారిటీ వివరాలను నిబంధనల మేరకు క్రోడీకరిస్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తప్పనిసరిగా జాబితాలు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి సత్వరచర్యలు చేపడతామని తెలిపారు. ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్, జిల్లా నాయకులు చంద్రన్, ఢిల్లీబాబు, సుబ్రమణ్యం పిళ్ళై, ఉమాపతి, మధుబాబు, నరేష్, ఇమ్రాన్, మనయ్య పాల్గొన్నారు.

పిఎఫ్ తుదిమొత్తాల మంజూరులో జాప్యం నివారించాలి


పదవీ విరమణ చెందిన ఉద్యోగుల పిఎఫ్ తుది మొత్తాల చెల్లింపులో నెలకొన్న జాప్యాన్ని నివారించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) చిత్తూరు జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈవో రవికుమార్ నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. వారు మాట్లాడుతూ పదవీ విరమణ చెంది ఏడాది పైబడుతున్నా వారి ఖాతాల్లో ఉన్న పీఎఫ్ సొమ్మును చెల్లించడానికి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎఫ్, ఆడిట్ విభాగంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. పీఎఫ్ ఖాతాల క్రమబద్ధీకరణలో ఎదురవుతున్న ఇబ్బందుల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సీఈవో రవికుమార్ నాయుడు మాట్లాడుతూ తుది మొత్తాల చెల్లింపులు వేగవంతం అయ్యేలా సత్వర చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కారుణ్య నియామక ప్రక్రియలో వీలైనంత త్వరగా న్యాయం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- వి కోట


గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని వారు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం పట్ల తీసుకున్న చర్యలను, మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఎంపీడీవో ఈశ్వరన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో మండల పరిధిలో భూగర్భ జలాలు అనుకున్న స్థాయిలో మెరుగుపడలేదని దీని ప్రభావంతో త్రాగునీటి బోర్లలో నీరు అడుగంటే ప్రమాదం ఉందని అధికారులను హెచ్చరించారు. గ్రామపంచాయతీల సర్పంచ్లు కార్యదర్శులను అప్రమత్తం చేసి ఎక్కడ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి సమస్యలు పరిష్కారానికి నిధులు కొరత లేదని గ్రామపంచాయతీలు, మండల పరిషత్ అవసరమైన మేరకు జిల్లా పరిషత్ నిధులను వెచ్చించి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో గుర్తించిన ప్రాంతాల్లో నూతనంగా బోర్లు వేసి వెంటనే బోరు మోటర్లు అమర్చి వాటికి సంబంధించిన ఎం బుక్‌లను సిద్ధం చేసి బిల్లులు చెల్లించాలని వారు ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. నేతలు అమర్నాథ్, మోహన్ రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



తాగునీటి సమస్యపై చర్చిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసులు

వెటర్నరీ డాక్టర్ నుంచి జిల్లా జాయింట్ డైరెక్టర్ వరకు

డాక్టర్ ప్రభాకర్ 40 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానం



ఉత్తమ జాయింట్ డైరెక్టర్‌గా మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటూ

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి) : వెటర్నరీ డాక్టర్ నుంచి చిత్తూరు జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ ఎం.ప్రభాకర్ ఈనెల 28న పదవీరమణ చేయనున్నారు. చిత్తూరు జిల్లా జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ ఉద్యోగరీత్యా అనేక పదోన్నతులు పొంది 40 ఏళ్ల పాటు చిత్తూరు జిల్లాలోనే ఉద్యోగం చేసి అరుదైన రికార్డు సృష్టించారు. 1963లో కీర్తిశేషులు లక్ష్మమ్మ దంపతలకు మూడవ సంతానంగా కర్నూలు జిల్లా కోవెలకుంటలో జన్మించారు. బాల్యం, ప్రాథమిక విద్య కర్నూల్‌లో సాగింది. ఎస్ఎస్‌సి పరీక్షలో మొదటి మార్కులతో నేషనల్ మెరిట్స్ స్కాలర్‌షిప్ పొందారు. ఇంటర్మీడియట్ బైపీసీ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో చదివి మొదటి ర్యాంక్ సాధించారు. అనంతరం 1980లో వెటర్నరీ కోర్స్ బీవీఎస్సీలో చేరారు. 1985 సీవి ఎస్సీ తిరుపతిలో పౌల్ట్రీ సైన్స్ చేస్తుండగా వెటర్నరీ డాక్టర్ పోస్ట్ రావడంతో ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. మొట్టమొదటి పోస్టింగు చిత్తూరు జిల్లా గుడిపాల మండలం 10 సంవత్సర శాఖ వెటర్నరీ విఐఎస్, ఎంహెచ్‌ఓగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. 1985 నుంచి 2002 వరకు 17 సంవత్సరాల పాటు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ గుడిపాల బొమ్మసముద్రం, జీడి నెల్లూరు, పూతలపట్టులో విధులు నిర్వహించారు. ఆ మండలాల్లో విఐఎస్‌గా అత్యధిక ఏఐలు నిర్వహించి బ్రెడ్ డెవలప్మెంట్‌కు ఎంతగానో కృషి చేశారు. అత్యవసర కేసులు అనేక శస్త్ర చికిత్సలు నిర్వహించి మంచి వైద్యుడిగా పేరు పొందారు. అనేక విస్తరణ కార్యక్రమాలు సదస్సుల ద్వారా రైతులకు దగ్గరై జిజెసి బొమ్మసముద్రంలో డైలీ టెక్నాలజీ కోర్సుకు పార్ట్ టైం లెక్చరర్‌గా విద్యను బోధించారు. జీడి నెల్లూరులో సీఎంఈవై కార్యక్రమంలో మండల యూత్ ఎంపవర్మెంట్ ఆఫీసర్‌గా యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారు. 2003లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఏహెచ్‌గా ప్రమోషన్ పొంది ఆత్మ ప్రాజెక్ట్ చిత్తూరులో డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సంవత్సరం పాటు విధులు నిర్వహించి అనేక కార్యక్రమాలు నిర్వహించారు.

2004 -2008 సంవత్సరం వరకు ఏడిహెచ్ వెటర్ని హాస్పిటల్ బంగారుపాల్యంలో విధులు నిర్వహించి పసుమిత్ర ప్రోగ్రాంకు అభ్యర్థులను ఎంపిక చేయడం కార్యక్రమాలు చేపట్టారు. 2008-2014 వరకు డివిజన్ ఏడి ఏహెచ్ చిత్తూరులో పనిచేసే ప్రతి సంవత్సరం 100శాతం సెంటర్స్ ఇన్స్పెక్షన్స్ చేయడం పీఎం ప్యాకేజీ సీఎం ప్యాకేజీ కింద ఓఎస్పి ప్రోగ్రాం నిర్వహించడం, పశు క్రాంతి, జీవ క్రాంతి కింద అనేకమంది రైతులకు పశువులు పంపిణీ చేసి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. 2014-2018 డివిజన్ ఏడి ఏహెచ్ మదనపల్లిలో విధులు నిర్వహించి కరువు నివారణ చర్యలు చేపట్టారు. పిఎస్ఎమ్ ద్వారా పాడి గొర్రెల పెంపకదారులకు విస్తృత శిక్షణ అవగాహన సదస్సులు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. 2018 జనవరిలో డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రమోషన్ పొంది 2018 -19 వరకు విపిసి చిత్తూరులో డిప్యూటీ డైరెక్టర్ ఏహెచ్ గా విధులు నిర్వహించారు. 40 మంది జీవమిత్రులకు ట్రైనింగ్ ఇచ్చి రాష్ట్రంలోని ఆదర్శంగా నిలిపారు. 2019- 2023 వరకు డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్‌గా చిత్తూరులో విధులు నిర్వహించి నోడల్ అధికారిగా పనిచేస్తూ ఏఎంసీలు బిఎంసియులకు స్థలాలు కేటాయింపు ఏహెచ్ఏలకు శిక్షణా కార్యక్రమాలు, అనేక మెగా హెల్త్ క్యాంప్స్ నిర్వహించి రైతులకు ఎన్నో సేవలు అందించడంలో ముందు నిలిచారు.

2023 -2025లో చిత్తూరు జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2024 ఏప్రిల్‌లో జిల్లా స్థాయిలో వరల్డ్ వెటర్నరీస్ డే నిర్వహించి విశ్రాంత వెట్స్ ప్రతిభ కనబరిచిన వెట్స్‌ను సత్కరించే కార్యక్రమం చేపట్టారు. 2024-25ఆర్థిక సంవత్సరంలో 2500 గోకులం నిర్మాణాలకు అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు ఇప్పించారు. ఉపాధి హామీ పథకం కింద రూ.50 కోట్ల నిధులతో ఈ పనులు జరుగుతున్నాయి. అలాగే చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 40 లక్షల రూపాయలతో అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

కుటుంబం, పిల్లల బాధ్యతలను తన భార్య విజయనిర్మల చూసుకోవడంతో 40 ఏళ్లపాటు ప్రభుత్వ ఉద్యోగం అంకితభావంతో చేసేందుకు వీలు కలిగిందని ఆయన తెలిపారు. డాక్టర్ ప్రభాకర్‌కు ఇద్దరు కుమారులు. ఒకరు డాక్టర్ మనోజ్ ఎండి పీడియాట్రిక్, సహన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్. రెండవ కుమారుడు మిథున్, సాఫ్ట్వేర్ ఇంజనీర్ టెక్నో మహేంద్ర చెన్నై.

ఉద్యోగ ప్రస్థానంలో పొందిన అవార్డులు

- **డివిజనల్ ఏడీగా పనిచేస్తున్నప్పుడు డౌట్ రిలీజ్ ఫౌండర్ డెవలప్మెంట్ కింద జిల్లా కలెక్టర్ సిద్ధార్థ జైన్ నుంచి ఉత్తమ అధికారి అవార్డు.**
- **బెస్ట్ డిడిఎహెచ్‌గా కలెక్టర్ నారాయణ భరత్ గుప్తా నుంచి అవార్డు స్వీకరించారు.**
- **ఉత్తమ జేడిగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ దివేది నుంచి అవార్డు పొందారు.**
- **చిత్తూరు జాయింట్ డైరెక్టర్‌గా ప్రస్తుత కలెక్టర్ సుమిత్ కుమార్ నుంచి ఉత్తమ అధికారిగా అవార్డు పొందారు.**
- **రాష్ట్రడిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అనిమల్ హస్బెండరీ ద్వారా ఉత్తమ అధికారిగా అవార్డు స్వీకరించారు.**





కుటుంబ సభ్యుల ఫోటో

ఓటియాన్ షాపింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: నగరంలో ఏర్పాటు చేసిన ఓటియాన్ షాపింగ్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవులు నాయుడు, మేయర్ ఎస్.అముద ప్రారంభించారు. ఈ సెంటర్ నుంచి అన్ని రకాల వస్తువులను ఆఫ్లైన్, ఆన్లైన్ ద్వారా కొనుగోలు చేయవచ్చని, హోమ్ డెలివరీ సౌకర్యం ఉందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, నాయకులు పాల్గొన్నారు.

పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల

పుష్పపల్లకి గ్రామోత్సవం

ప్రజాశక్తి - సోమల: సోమల మండలం దుర్గంకొండపై వెలసిన గార్గేయ మునీశ్వరస్వామి ఆలయం వద్ద శివరాత్రి పర్వదినం సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు తదనంతరం పుష్ప పల్లకిలో ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించగా భక్తులు కర్పూర హారతులను అందజేశారు.

రావణబ్రహ్మ వాహనంపై ఆదిదేవుడు



ప్రజాశక్తి - బంగారుపాళ్యం: రావణబ్రహ్మ వాహనంపై ఆదిదేవుడు భక్తులకు దర్శనం గావించారు. గురువారం మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ కామాక్షి సమేత మొగిలేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ఆదిదేవుడు కైలాసగిరి రావణబ్రహ్మ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బెంగళూరుకు చెందిన సుధారాణి వెంకటరెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. గురువారం రాత్రి శేషవాహనంపై శివపార్వతులు భక్తుల దర్శనమిచ్చారు. ఉభయదారులుగా మండలంలోని కొండేటివాండ్ల గ్రామానికి చెందిన సుమతి, రంగనాధం నాయుడు వ్యవహరించారు. ఆలయ సిబ్బంది శరవణ కుమార్, మధు, అర్చకులు రెడ్డప్ప గురుకుల్, విశ్వనాథ్ గురుకుల్, సోమ గురుకుల్ పవన్ గురుకుల్, అర్కేష్ గురుకుల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా

గౌతమ్‌రాజు



ప్రజాశక్తి - కార్వేటి నగరం: కార్వేటినగరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా గౌతమ్ రాజును జిల్లా డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గౌతమ్ రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జీడి నెల్లూరు అధ్యక్షులు రమేష్‌బాబు గౌతమ్ రాజు నియామకంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర పిసిసి అధ్యక్షులు షర్మిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయం వెనక్కు తీసుకోవాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటి యు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తిరుపతి జిల్లాలోని అన్ని అర్బన్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు చేపడుతామని జిల్లా అధ్యక్షులు వద్దిపల్లి చెంగయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాల్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్రీడల్లో ఎస్‌పిడబ్ల్యు విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు వివిధ జాతీయ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరందరిని తిరుపతి జిల్లా విద్యాధికారి కెవిఎన్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరిదేవి, ఎస్పిఎఫ్ సెక్రటరీ ఎస్. సురేష్, నెల్లూరు వ్యాయామ ఉపాధ్యాయుడు జి. ప్రసాద్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలందించి ప్రత్యేకంగా శుభాభినందనలు తెలిపి, వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ సాయి సుమతిని అభినందించారు. పశ్చిమబెంగాల్‌లో 68వ జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ 19 లో టి.సాయి, వై.గంగాభవాని, ఎస్ ధరణి, ఢిల్లీలో జరిగిన అండర్ 19 కుస్తీ పోటీల్లో ఆర్.లక్ష్మి లావణ్య, కె.రెడ్డి జీవన, ఇ.సౌమ్య, 68వ జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ 17 లో నర్సింగాపూర్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో ఎమ్.లిఖిత, 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ అండర్ 19 లో జార్ఖండ్ అథ్లెటిక్స్ లో ఎస్.అక్షిత, 68వ స్కూల్ గేమ్స్ అండర్ 19 జూడో విభాగంలో పంజాబ్ లో జరిగిన జూడోలో ఎమ్.రేవతి, 68వ స్కూల్ గేమ్స్ పటియాలలో జరిగిన బాస్కెట్ బాల్ క్రీడల్లో వి.మోక్షలు విజేతలుగా నిలిచారు.

స్టైఫండ్ పెంచండి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ విద్యార్థుల స్టైఫండ్ పెంచాలని, విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మెకు గురువారం ఏపీ రైతు సంఘం, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం సంపూర్ణంగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్టైఫండ్ పెంచాలని, లేని పక్షంలో రైతు సంఘం, అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర నాయక్, రైతు సంఘం జిల్లా నాయకులు గోవిందస్వామి, నగర నాయకులు ఓం రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ అందించాలి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలో పింఛను పంపిణీ చేయు అధికారులు లబ్ధిదారులకు ఇంటివద్దే అందించాలని గురువారం ఎంపిడిఓ మహమ్మద్ రఫీ ఒక ప్రకటనలో కోరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందువలన వృద్ధులు, వికలాంగులు, మహిళలకు ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలని సూచించారు. అందు బాటులో లేని పింఛనుదారులకు 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పింఛను పంపిణీ చేయదలచిన కారణాలు కూడా అధికారులు తమ మొబైల్ యాప్‌లో పొందు పరచాలన్నారు.

సంపద కేంద్రాల్లో తనిఖీలు



సంపద కేంద్రాలను తనిఖీ చేస్తున్న ప్రసాద్

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లి గొల్లచిమనపల్లి, ఆలపల్లి, ఖమ్మంపల్లి, దిగువూరు, తీర్థం, దేవదొడ్డి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను పిఆర్ అండ్ ఆర్‌డిడిజి ప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ సెక్రటరీలకు తగిన సూచనలు సలహాలు అందించారు. గ్రామాల్లో చెత్తసేకరణ ఉదయం ఎనిమిది గంటలకు పూర్తి చేయాలని ఆదేశించారు. చెత్త నుండి సంపద వచ్చేవిధంగా చర్యలు చేపట్టి అధిక చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేంద్రియ ఎరువుగా మార్చి రైతులకు ఉపయోగపడేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయా పంచాయతీల కార్యదర్శి మండల కోఆర్డినేటర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



ప్రజాశక్తి - బంగారుపాళ్యం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి తాత్కాలిక హుండీ లెక్కించినట్లు ఆలయ వంశపార ధర్మకర్త విజయ్ కుమార్, ఆలయ ఇన్స్పెక్టర్ సుమన ప్రియ తెలిపారు. గురువారం తాత్కాలిక హుండీ లెక్కించగా రూ.1,54,354లు ఆదాయం, సేవా టిక్కెట్లు ద్వారా రూ.2,04,720లు, అన్నదాన రశీదు ద్వారా ఆదాయం రూ.35,619లు వచ్చిందని తెలిపారు.

మంత్రిని కలిసిన షణ్ముగం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర మైన్స్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రని టిడిపి సీనియర్ నాయకులు, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్, దక్షిణాది రాష్ట్రాల జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఇన్‌ఛార్జి షణ్ముగం మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం మచిలీపట్నంలోని మంత్రి నివాసంలో కలిసి సత్కరించి తిరుమల శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవుల్లో న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు.

అబ్దుల్ రహీంకు అభినందన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నియోజకవర్గంలో, 65 మసీదుల ముత వల్లి కమిటీలకు అధ్య క్షుడిగా ఎన్నుకోబడిన అబ్దుల్ రహీమ్‌ను గూడూరు మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్వర్క్ తరపున వెల్ఫేర్ గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు మహబూబ్ బాషా సెక్రటరీ షేక్ శానవాజ్, అప్సర కరీముల్లాలు అభినందించారు. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ ఇమామ్, మౌసన్‌ల జీతభత్యాల విషయమై కృషి చేస్తానని తెలిపారు.

భాస్కర్ రాజు మరణం తీరని లోటు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశ్రాంత ఉద్యో గుల సంఘం అధ్యక్షు లు బసవరాజు భాస్క ర్ రాజు మరణం తీ౦ని లోటని నగరి ఎమ్మె ల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూ రు మున్సిపాలిటీ, ఒంటిమిట్టలో ఉన్న భాస్కర్ రాజు స్వగృహంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ నారాయణ బాబు, బాలసుబ్రమణ్యం రాజులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్ జిల్లా గవ ర్నర్ గౌతం పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యం లో గురు వారం నగర పరిధిలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, మల్లెమాల మురళి రెడ్డి, వాకాటి రామ్మోహన్, బీ సీనయ్య, కళ్యాణ సాయి, ఎం రూపేష్ రెడ్డి, మదనమేటి రమణయ్య, అక్కన రమణయ్య, క్లబ్ కార్యదర్శి కే శివయ్య, ట్రెజరర్ వీరేంద్రనాథ్, జిల్లా అడిషనల్ సెక్రెటరీ హనుమం తరావు, పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త కార్వీలకు అనుమతులు ఇవ్వొద్దు

ప్రజాభిప్రాయ సేకరణలో సి.బండపల్లి గ్రామస్తులు



ప్రజాశక్తి- శాంతిపురం: కొత్త క్వారీలకు అనుమతులు ఇవ్వొద్దు అంటూ సి. బండపల్లి గ్రామస్తులు అధికారులకు విన్నవించుకున్నారు. గురువారం మండల పరిధిలోని సి.బండపల్లి గ్రామ సచివాలయం ప్రాంగణం వద్ద గురువారం గ్రానైట్ లీజు కొరకు పర్యావరణ ప్రజాఅభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి, కుప్పం ఆర్డీవో అధ్యక్షతన జరిగింది. బియాండ్ స్కేల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.62లక్షల పెట్టుబడితో ముద్దనపల్లి గ్రామం, శాంతిపురం మండలం, చిత్తూరు జిల్లాలోని సర్వే నెం.54/పి వద్ద 4.301 హెక్టార్ల లీజ్ స్థలంలో సంవత్సరంకు కలర్ గ్రానైట్ మైనింగ్ 9,465 క్యూబిక్ మీటరు మైనింగ్ ప్రతిపాదనకు సంబంధించి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు అనుమతిని ఇవ్వరాదని అధికారులను కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇక్కడ ఉన్నటువంటి రాతి పనులు చేసుకోవడానికి స్థానికులకు మాత్రమే అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అంతే కాకుండా ప్రతిపాదిత స్థలంలో బ్లాస్టింగులు చేయడం వల్ల పక్కనున్న అమ్మవారి దేవాలయం దెబ్బతింటుందని, ఇల్లు బీటలు వారుతాయని, రోడ్లు పాడువుతాయని, వాహన కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. ఈ విషయంపై ఆర్ఈవో స్పందిస్తూ మీరు తెలిపిన విషయాలను పై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ అధికారులు, ఆర్డీవో శ్రీనివాస్, తహశీల్దార్ శివయ్య, గ్రామస్తులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'విజయానంద రెడ్డి ఆరోపణలు అవాస్తవం'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గంపై విజయానంద రెడ్డి అసత్య ఆరోపణ చేయడాన్ని తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. చిత్తూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఎన్నడూ లేని విధంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసిపి నాయకులు విజయానంద రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఐదేళ్ల కాలంలో దాచుకోవడం దోచుకోవడానికి పరిమితమైన వైసిపి నేతలు అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11 సీట్లకే పరిమితమైన వైసిపి నాయకులు ఇప్పటికైనా ప్రజాభిప్రాయాన్ని గౌరవించి అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా ఉన్న విజయానంద రెడ్డి చిత్తూరు బస్టాండు రోడ్డు కూడా మరమ్మతు చేయలేకపోయారని ఒక కొత్త సర్వీసులు కూడా ప్రారంభం లేదన్నారు. గురజాల అధికారంలోకి వచ్చిన తర్వాత చిత్తూరు నుండి 31 కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించారని, గుడిపాల మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు నగరాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు మానుకోవాలని సూచించారు. చిత్తూరు అభివృద్ధి ఆధారాలతో పాటు ఎక్కడికైనా ఎప్పుడైనా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాలు విసిరారు. టిడిపి నాయకులు ఈశ్వర్ సీఎం విజయ, గోపాల్ వెంకటేష్, మాజీ మేయర్ సుగ్రీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వరుణ్ కుమార్

రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల బాలుడు మృతి



మృతి చెందిన చారుకృష

ప్రజాశక్తి- ఏర్పేడు : తొట్టంబేడు మండలం విరుపాక్షపురానికి చెందిన పుచ్చకాయల కిరణ్ ప్రస్తుతం బీపీ అగ్రహారం శ్రీకాళహస్తిలో నివాసం ఉంటున్నాడు. ఇతను తన ద్విచక్ర వాహనం మీద తన మేనల్లుడు చారుకృష వయస్సు (4) ఏర్పేడు మండలం మేర్లపాక నుంచి తీసుకుని వెళుతూ, శ్రీకాళహస్తి మండలం ఇసుక గుంట కోకో కోలా కంపెనీ వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు.

తిరుమలలో ప్రక్షాళన చేపట్టండి

టీటీడీ చైర్మన్ ను కలిసిన "తిరుమల పరిరక్షణ సైన్యం" ప్రతినిధులు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల కొండపై స్థానికులను పట్టించుకోకుండా, రాజకీయ ఒత్తిడితో స్థానికేతరులను చేరదీయడం కారణంగా తట్టల పేరుతో ఆక్రమణలు, అసాంఘిక శక్తులు పెరిగిపోయి పవిత్రత, ప్రశాంతత దెబ్బతింటోందని, వెంటనే తిరుమలలో ప్రక్షాళన మొదలు పెట్టాల్సిన అవసరం ఉందని తిరుమల పరిరక్షణ సైన్యం ప్రతినిధులు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బి.ఆర్ నాయుడుకు విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుమలలో టిటిడి చైర్మన్‌ను కలిసిన తిరుమల పరిరక్షణ సైన్యం ప్రతినిధులు కోలా లక్ష్మీపతి, వి కృష్ణ, పి వాసుదేవన్, కే.హరి ప్రసాద్, వేలు, ముని వెంకటయ్య తదితరులు ఆయనతో సమావేశమై తిరుమలలో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులపై చర్చించారు. అనంతరం తిరుమలలో ప్రక్షాళన చేపట్టాలని వినతి పత్రం అందించారు. తిరుమల శ్రీవారి ఆలయ అభివృద్ధి కోసం స్థలాలు అప్పగించి ఎన్నో త్యాగాలు చేసిన స్థానికులను ప్రస్తుతం టీటీడీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల కొండపై స్థానికులకు మాత్రమే జీవనోపాధి కల్పించాల్సిన టిటిడి స్థానికేతరులను ప్రోత్సహించిన కారణంగా అసాంఘిక శక్తులు కొండపై తిష్ట వేశాయని చెప్పారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా తిరుమల కొండపై ప్రక్షాళన మొదలు పెట్టాల్సిన అవసరం ఉందని, తొలుతగా ఏళ్ల తరబడి తిరుమల కొండపై తిష్ట వేసిన అధికారులను ఉద్యోగులను బదిలీ చేసి అనుభవజ్ఞులైన సేవా దృక్పథం కలిగిన వారిని నియమించాలన్నారు. అలాగే కొండపై 1200 షాపులు, 720 హాకర్ లైసెన్సులను మాత్రమే టీటీడీ అనుమతి ఇచ్చి ఉందని, వాటికి టెనెంట్ నెంబర్ కూడా ఉన్నాయని, వీటిని మాత్రమే పరిగణలోకి తీసుకొని మిగిలిన అనధికారిక హాకరులను, తట్టలను తొలగించే విధంగా టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. టీటీడీ చేపట్టే ప్రక్షాళనకు తిరుమల పరిరక్షణ సైన్యం అండగా ఉంటుందని పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. దీనిపై చైర్మన్ బి ఆర్ నాయుడు సానుకూలంగా స్పందిస్తూ తప్పనిసరిగా టిటిడిలో ప్రక్షాళన మొదలుపెట్టడం ఖాయమని, ఏళ్ల తరబడి తిరుమల కొండ పై తిష్టవేసిన కొంతమంది ఉద్యోగుల కారణంగా ఇటీవల సమస్యలు కూడా అధికమయ్యాయని అన్ని సమస్యలపై ఇప్పటికే ఒక అవగాహనతో కార్యాచరణతో ముందుకు వెళతామన్నారు. పంచాయతీ రెవెన్యూ విభాగంలో ఇంతకాలం ఉన్న అవినీతి అధికారి కారణంగా తిరుమల కొండపై ఇష్టానుసారంగా ఆక్రమణలు వెలిశాయని గుర్తించామన్నారు. లైసెన్సులు లేని హాకరులను తొలగించి రాజకీయ ఒత్తిడి లను పట్టించుకోకుండా తిరుమల పవిత్రతకు ప్రశాంతతకు విజిలెన్స్ విభాగం ప్రక్షాళనకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని చైర్మన్ వెల్లడించారు.

సామ్‌సంగ్ సరికొత్త సర్వీస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : శామ్‌సంగ్, భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, స్మార్ట్‌ఫోన్ కస్టమర్ సర్వీస్ అనుభవాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడానికి సేవా కేంద్రాలను సమూలంగా పునరుద్ధరిస్తోందని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సునీల్ కుటిన్హా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రీమియం కస్టమర్ కేర్ మీద దృష్టి సారించి, అమ్మకాల తర్వాత అత్యుత్తమైన మద్దతుకు శామ్‌సంగ్ నిబద్ధతను బలోపేతం చేస్తూ, సజావు సర్వీస్–టు–సేల్స్ ప్రయాణాన్ని సాగిస్తున్నామన్నారు. శామ్‌సంగ్ తన సేవా కేంద్రాలను ఇంటిగ్రేటెడ్ ఓమ్ని–ఛానల్ అనుభవానికి అనుగుణంగా పునర్నిర్మించింది. ఇందులో అంతర్నిర్మిత వైర్‌లెస్ ఛార్జింగ్ స్టేషన్లు, ఖరీదైన సోఫా–శైలి సీటింగ్ ఉంటాయి, వినియోగదారులు మరింత ఆహ్లాదకరమైన అనుభవాన్ని పొందగలరని తెలిపారు. శామ్‌సంగ్ ప్రస్తుతం ఫిజికల్ సర్వీస్ సెంటర్లు, రెసిడెంట్ ఇంజనీర్లు, కలెక్షన్ పాయింట్లతో సహా భారతదేశం అంతటా 3వేలకు పైగా సర్వీస్ టచ్ పాయింట్లను నిర్వహిస్తోంది. సర్వీస్ సెంటర్ పున్ణరూపకల్పన ప్రారంభించడం కీలక నగరాల్లో దశలవారీగా అమలు చేయబడుతుంది, ఇది దేశవ్యాప్తంగా మెరుగైన కస్టమర్ అనుభవాన్ని నిర్ధారిస్తుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

14న కుమారధార తీర్థ ముక్కోటి

ప్రజాశక్తి - తిరుమల: మార్చి 14వ తేదిన తిరుమలలో జరగనున్న కుమారధార తీర్థ ముక్కోటి పై టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి గురువారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుమారధార తీర్థ ముక్కోటికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 14వ తేది ఉదయం 6 గంటల నుండి 12 గంటల వరకు మాత్రమే భక్తులను కుమారధార తీర్థానికి అనుమతిస్తామన్నారు. అధికబరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, చిన్నపిల్లలు, వద్దుల శ్రేయస్సును దష్టిలో ఉంచుకుని అటవీ మార్గంలో ఈ తీర్థానికి నడిచి వెళ్లడానికి అనుమతించమని తెలిపారు. పాపవినాశనం నుండి కుమారధార తీర్థం వరకు అక్కడక్కడ భద్రతా సిబ్బందిని వుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. మార్గమధ్యంలో తాగునీటిని అందుబాటులో ఉంచాలని, అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పాపవినాశనం డ్యామ్ వద్ద ఉదయం 6 గంటల నుండి భక్తులకు పొంగళి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, ట్రాన్స్ పోర్ట్ జీఎం శేషారెడ్డి, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన చొక్కలింగం

ప్రజాశక్తి- కార్వేటినగరం: ద్విచక్రవాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘన మండల పరిధిలోని అన్నూరు బస్సు షెల్టర్ వద్ద చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వెదురుకుప్పం మండలం బిచవటగుంట దళితవాడకు చెందిన గోవర్ధన్ ద్విచక్రవాహనంలో కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి దళితవాడలోని తన అత్తగారి ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో అన్నూరు బస్సు షెల్టర్ వద్ద మండలంలోని అల్లాగుంట గ్రామానికి చెందిన చొక్క లింగం(66) బస్సు కోసం వేచిఉన్న సమయంలో గోవర్ధన్ ద్విచక్రవాహనంలో అతి వేగంగా దూసుకొచ్చి రోడ్డు పక్కన నిలిచి ఉన్న చొక్క లింగాన్ని ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనంలో వచ్చిన గోవర్ధన్‌కు తీవ్రగాయాలు కావడంతో అతన్ని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకి తరలించడం జరిగిందన్నారు. చొక్కలింగం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఏడు మందికి గాయాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని మొగిలి ఘాట్లో గురువారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం చెందిన కొందరు పలమనేరు వరకు బస్సులో వచ్చి అక్కడి ఆటోలో మొగిలికి వస్తుండగా బెంగళూరు నుండి చిత్తూరుకు వస్తున్న లారీ ఆటో వెనుక భాగంలో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పద్మ, కల్పన, తులసమ్మ, ప్రేమ, వెంకటేష్, మనోహర్‌లకు గాయాలు కాగా 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విలేకరి వెంకటేష్‌కు మాతృ వియోగం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రజాశక్తి శ్రీకాళహస్తి రూరల్ విలేకరి కావేరిపాకం వెంకటేష్‌కు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి కావేరిపాకం నీలమ్మ(78) గురువారం అనారోగ్యంతో ఆకస్మిక మృతి చెందారు. ఆమె మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, నాయకులు గంధం మణి, గురవయ్య, ప్రజాశక్తి మేనేజర్ సిఎస్ ప్రసాద్, డెస్క్ ఇన్‌ఛార్జి ఎ.వనజ, బ్యూరో వి.గోపి, డివిజన్ ఇన్‌ఛార్జి కిషోర్‌లు నివాళి అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నీలమ్మ అంత్యక్రియలు శుక్రవారం ఉదయం పూసల వీధిలోని యూసఫ్ మసీదు వద్ద జరుగుతాయి.

'సిటీ ఆపరేషన్ సెంటర్' త్వరగా పూర్తి చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్మార్ట్ సిటీ నిధులతో అత్యాధు నిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయా లని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. పాత మునిసిపల్ కార్యాలయం స్థానంలో స్మార్ట్ సిటీ నిధులతో గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్థులలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను ఇంజినీరింగ్, స్మార్ట్ సిటీ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈ.ఈ.రవి, ఏఈకాం ప్రతినిధులు బాలాజి, అనిల్ ఉన్నారు.

'ఏ బిలియనీర్స్ ఒడిస్సీ' ప్రత్యేక గాలా నైట్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : గత ఏడాది సాధించిన విశేష విజయాలు, ఈ ఏడాది కంపెనీ పదో వార్షికోత్సవ ప్రణాళికలతో వీటీ మార్కెట్స్ 'ఏ బిలియనీర్స్ ఒడిస్సీ' అనే ప్రత్యేక గాలా నైట్ నిర్వహించింది. ఈ ప్రఖ్యాత కార్యక్రమం థాయ్లాండ్లోని బ్యాంకాక్లోని సియామ్ కెంపిన్స్కి హోటల్, ఛంద్ర బాల్రంలో జరిగింది. ప్రముఖ క్లయింట్లు, భాగస్వాములు, పరిశ్రమ నాయకులు ఈ వేడుకకు హాజరై వీటీ మార్కెట్స్ విజయవంతమైన ఏడాదిని గుర్తు చేసుకున్నారు. వ్యాపార అభివద్ధి విభాగం ప్రతినిధి మౌరీ ముర్గియోని మాట్లాడుతూ గత ఏడాది వీటీ మార్కెట్స్ అనేక విజయాలు సాధించిందన్నారు. వీటిలో ట్రేడింగ్ వాల్యూమ్లో 150 శాతం వద్ధి, గ్రాస్ డిపాజిట్లు, తొలి ట్రేడింగ్లలో రెట్టింపు వద్ధి వంటివి ఉన్నాయన్నారు. 2025లో ఎదుగుతున్న మార్కెట్లు, కొత్త ఆర్థిక సాధనాలపై ఉన్న అవకాశాలపై తమ అభిప్రాయాలు తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయ భవనానికి మరమ్మతులు

ప్రజాశక్తి- ఏర్పేడు : ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయం దాదాపు 40 ఏళ్ళ క్రిందట నిర్మించిన భవనం కావడంతో సీలింగ్ పెచ్చులు ఊడి వర్షాకాలంలో ఉరుస్తోంది. దీంతో ఫైళ్లు తడిసిపోవడం వంటి సమస్యలతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఏర్పేడు జడ్పిటిసి డాక్టర్ కావేరి తిరుమలయ్య ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ నాయుడు 20 లక్షల రూపాయలు జడ్పీ నిధులను మంజూరు చేశారు. భవన మరమ్మతు పనులను పంచాయతీరాజ్ డి.ఇ వెంకట వినోద్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఏర్పేడు పిఆర్ ఇంచార్జ్ ఏఈ రవితేజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాధిక్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

మెరుగైన సేవలే మా లక్ష్యం: కెనరా బ్యాంక్ జీఎం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కెనరా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేస్తామని బ్యాంక్ తిరుపతి సర్కిల్ జీఎం పాండురంగ మితంతాయ పేర్కొన్నారు. గురువారం తిరపతి, ఎమ్ ఆర్ పల్లి లక్ష్మీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు బ్రాంచ్‌ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కార్యాలయం ఏజీఎం నాగరాజరావు, డివిజనల్ మేనేజర్లు శరవణ కుమార్, సువర్ణ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ మాఫియాపై నిఘా

- మట్టి తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేసిన రెవెన్యూ అధికారులు
- అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు
- అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకమైన కమిటీ ఏర్పాటు



ఆర్ సి పురంలో గ్రావెల్ టిప్పర్‌ను పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండలంలో వివిధ ప్రాంతాల నుండి అనుమతులు లేకుండా గ్రావెల్ (ఎర్ర మట్టి)ని రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేశారు. నెత్తుకుప్పంలో గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను గురువారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. విషయం తెలుసుకున్న మట్టి మాఫియా కేటుగాళ్లు గ్రావెల్ టిప్పర్లను నిలిపివేశారు. నెత్తకుప్పం రెవిన్యూ పిల్లారకోన సమీపంలో ఓ వ్యక్తి గుట్ట పోరంబోకు స్థలంలో హిటాచి సహాయంతో గ్రావెల్ మట్టిని తోడేసి టిప్పర్ల ద్వారా తిరుపతికి తరలిస్తుండగా రవాణా చేస్తున్న వాహనాలను వీఆర్వో బాబు అడ్డుకుని అనుమతి లేకుండా మట్టిని ప్రభుత్వ భూమిలో తోడినా, టిప్పర్ల ద్వారా తరలించినా వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఆర్సీపురానికి చెందిన ఒక వ్యక్తి గ్రావెల్ టిప్పర్‌ను పట్టుకున్నారు. ఆ టిప్పర్ వైసిపి కి చెందిన ఓ వ్యక్తిది, కానీ ఆ టిప్పర్‌పై సదరు వ్యక్తి పేరు రాసుకుని గ్రావెల్ తరలిస్తున్నాడు. టిప్పర్‌ను వదిలేయమని రాజకీయ ఒత్తిడి వచ్చిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు హెచ్చరించి వదిలేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ గ్రావెల్ క్వారీ అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రావెల్ అక్రమ రవాణా అరికట్టడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి, జరిమానా విధిస్తామని మైన్స్ అధికారులు తెలిపారు.